بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحْمَدُهٗ وَنُصَلِّي عَلٰى رَسُوْلِهِ الْكَرِيْمِ وَعَلٰى عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْد

Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V, 17 October 2025 (Telugu)

## తబూక్ యుద్ధ నేపథ్యంలో
## హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర ప్రస్తావన

**హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 17.10.2025 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ. أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ. بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠించిన అనంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

గత ఖుత్బాలో తబూక్ యుద్ధం గురించి క్లుప్తంగా ప్రస్తావించబడింది, దాని మరికొన్ని వివరాలను ఈ రోజు నేను వివరింతును.

హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ రజియల్లాహు అన్హు ఈ యుద్ధ నేపథ్యాన్ని వివరిస్తూ ఇలా అన్నారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మక్కాను జయించినప్పుడు ఖజ్రజ్ తెగకు చెందిన అబూ ఆమిర్ మదనీ అనే వ్యక్తి ఒకడుండేవాడు. అతను యూదులు, క్రైస్తవులతో కలిసి మెలిసి ఉండటం వలన దేవుని స్మరణ, కీర్తి చేసే అలవాటు కలిగి ఉండెను. కావున ప్రజలు అతన్ని రాహిబ్ (సన్యాసి) అని పిలిచేవారు. అయితే అతను మతపరంగా క్రైస్తవుడు కాదు. ఈ వ్యక్తి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మదీనాకు వచ్చిన తర్వాత మక్కాకు పారిపోయెను. మక్కా కూడా జయించబడినప్పుడు, ఇస్లాంకు వ్యతిరేకంగా అల్లర్లు సృష్టించడానికి కొత్త పన్నాగం పన్నాలని అతను ఆలోచించడం మొదలు పెట్టాడు. చివరికి అతను తన పేరును, వేషధారణను మార్చుకుని మదీనా సమీపంలో ఉన్న ఖుబా అనే గ్రామంలో నివసించడం మొదలు పెట్టాడు. చాలా సంవత్సరాలు బయట ఉన్నందున మదీనా ప్రజలు సాధారణంగా అతన్ని గుర్తించలేక పోయారు. అతను మదీనాలోని మునాఫిఖ్‌లు (కపటులు)తో కలిసి ఈ విధంగా కుట్ర పన్నాడు. నేను సిరియా (షామ్)కు వెళ్లి క్రైస్తవ ప్రభుత్వాన్ని, అక్కడున్న అరబ్ క్రైస్తవ తెగలను రెచ్చగొట్టి, వారిని మదీనాపై దాడి చేయడానికి ప్రేరేపిస్తాను. ఇక్కడ మీరు సిరియాల సైన్యం మదీనాపై దాడి చేయబోతోందని ప్రచారం చేయండి.

అందుతున్న వార్తల ఆధారంగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ నిర్ణయానికి వచ్చారు: అనగా రోమన్లతో తలపడటంలో ఆలస్యం చేస్తే ఎక్కువ నష్టాలు సంభవిస్తాయి, కాబట్టి రోమన్లకు దాడి చేసే అవకాశం ఇవ్వకుండా, వారి ప్రాంతంలోకి వెళ్లి నిర్ణయాత్మక యుద్ధం చేయాలనే నిర్ణయించుకున్నారు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సాధారణంగా తమ సైనిక దండయాత్రలను గోప్యంగా

ఉంచేవారు, కానీ ఖైబర్ తర్వాత తబూక్ దండయాత్ర మాత్రమే బహిరంగంగా ప్రకటించబడింది. దారిలో ఎదురయ్యే కష్టాలు మరియు శత్రువుల సంఖ్య గురించి ముందుగానే తెలియజేశారు.

అది కరువుతో కూడిన సంవత్సరం, ఆహార కొరత కూడా ఉండెను. ప్రజలు తమ పంటలను కోయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్న సమయంలో జిహాద్ (యుద్ధానికి) బయలుదేరాలని ప్రకటన వెలువడింది. వేసవి కాలం, వందల మైళ్ల ప్రయాణం మరియు ప్రయాణ సామాగ్రి కొరత కూడా దీనికి తోడయ్యాయి. ఇన్ని సమస్యలు ఉన్నప్పటికీ దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి ద్వారా జిహాద్‌కు వెళ్లాలనే ఆజ్ఞ వెలువడగానే తమ ప్రాణాలను అర్పించే అనుచరులు యుద్ధానికి సిద్ధం కావడం మొదలు పెట్టారు.

ఈ సందర్భంగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ధనవంతులైన అనుచరులకు ఆర్థిక త్యాగం చేయమని పిలుపునిచ్చారు. అప్పుడు అందరికంటే ముందుగా హజ్రత్ అబూ బక్ర్ సిద్దీఖ్ రజియల్లాహు అన్హు తన ఇంట్లోని మొత్తం సంపదను తీసుకొని హాజరయ్యారు. హజ్రత్ ఉస్మాన్ రజియల్లాహు అన్హు ఈ యుద్ధం కోసం పలకాలు మరియు కజావా సహా సిద్ధంగా ఉన్న మూడు వందల ఒంటెలను సమర్పించారు. ఒక ఉల్లేఖనం ప్రకారం ఆయన వెయ్యి దీనార్లను కూడా సమర్పించారు. మరికొన్ని కథనాల ప్రకారం ఈ యుద్ధంనకు అవసరమైన మొత్తం ఖర్చులను హజ్రత్ ఉస్మాన్ రజియల్లాహు అన్హు భరించారు.

హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ రజియల్లాహు అన్హు ఈ సందర్భంగా వంద లేదా రెండు వందల లేదా నాలుగు వందల ఓఖియా వెండిని సమర్పించారు.

హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు త'ఆలా బినస్రిహిల్ అజీజ్ ఇలా ప్రవచించారు. అహ్మదియ్య ముస్లిం జమాఅత్ సభ్యులు కూడా ఆర్థిక త్యాగాల ప్రాముఖ్యతను అర్థం చేసుకున్నారు. ధనవంతులు, ఆర్థికంగా మంచి స్థితిలో ఉన్న వారు కూడా హజ్రత్ అబూ బక్ర్ సిద్దీఖ్ రజియల్లాహు అన్హు, హజ్రత్ ఉమర్ రజియల్లాహు అన్హు, హజ్రత్ ఉస్మాన్ రజియల్లాహు అన్హు గారల ఆదర్శాలను తమ ముందుంచుకోవాలి. ఈ సందర్భంగా, ధనవంతులైన అనుచరులతో పాటు, పేద, నిస్సహాయ అనుచరులు కూడా తమ శక్తిమేరకు ఆర్థిక త్యాగాలను సమర్పించుకున్నారు. మునాఫిఖ్‌లు (దాంబికులు) ఈ పేద అనుచరుల త్యాగాలను ఎగతాళి చేసేవారు. మహిళలు కూడా ఈ సందర్భంగా తమ ఆభరణాలను సమర్పించడం ద్వారా ఆర్థిక త్యాగంలో పాలుపంచుకున్నారు.

దాంబికులు తమ వంతుగా పూర్తి ప్రయత్నం చేసి ముస్లింలను యుద్ధానికి వెళ్లకుండా ఆపడానికి ప్రయత్నించారు. ఎండ, వేడి తీవ్రంగా ఉంది, శత్రువు చాలా శక్తిమంతుడు అని దాంబికులు అనేవారు. మదీనా ప్రజలు వృత్తిరీత్యా వ్యవసాయదారులు. కనుక ఆ సమయంలో వారి పంటలు కోయడానికి సిద్ధంగా ఉండెను. దాంబికులు ప్రజలను యుద్ధానికి వెళ్లకుండా అడ్డుకున్నారు, కానీ వారి ప్రచార ప్రభావం వినమ్రులైన, సత్యమూర్తులైన అనుచరులపై ఏమాత్రం పడ లేదు.

దాంబికులు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి, యుద్ధానికి వెళ్లకపోవడానికి సాకులు చెప్పేవారు. అందుకు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారందరికీ అనుమతి ఇచ్చేవారు. అయితే, పవిత్ర ఖుర్‌ఆన్ ఆ కపటులందరి గుట్టును రట్టు చేసింది. పవిత్ర ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ తఆలా ఇలా ఉపదేశించెను.

అనగా తొందరలో లభించు లాభము గాని, దగ్గరి ప్రయాణము గాని వున్నచో వీరు నీ వెంట వచ్చు వారు. కాని వారికి ప్రయాణము దూరముగా అగుపించినది. (నీవు తిరిగి వచ్చిన తరువాత) అల్లాహ్ ప్రమాణములు చేసి ఇట్లందురు. "మాకు శక్తి గాని, యోగ్యత గాని, వుండినచో మేము తప్పక నీ వెంట వెళ్ళే వారము. (వీరు) తమ ప్రాణాలను చంపుకొందురు. అల్లాహ్ వీరు అబద్ధమాడు వారని ఎరుగును. నీవు చేసిన తప్పు దుష్ప్రభావమును అల్లాహ్ రూపు మాపెను. నీకు గౌరవము నొసంగెను. మీరు (అనుమతి అడిగిన వారికి) వెనుక వుండుటకు ఎందుకు అనుమతించి వుండిరి. (వారు వెళ్ళాలని పట్టుబట్టి ఉండినచో) సత్యమాడు వారు బహిర్గతమగు చుండిరి. నీవు అబద్ధమాడు వారిని తెలుసుకొని వుందువు. అల్లాహ్‌ను, అంతిమ దినమును విశ్వసించు వారు తమ ధనము ప్రాణములతో యుద్ధము నుండి తప్పించుకొనుటకు అనుమతి అడగరు. అల్లాహ్ ధర్మ నిష్ఠాపరులను బాగుగా ఎరుగును. అల్లాహ్‌ను అంతిమ దినమును విశ్వసించని వారే వెనుక నుండుటకు అనుమతిని అడుగుదురు. వారి హృదయములలో అనుమానములు పుట్టినవి. తమ అనుమానాల వలన వారు ఒకప్పుడు ఇక్కడ, ఒకప్పుడు అక్కడ వుందురు. వారు (యుద్ధమునకు) వెళ్ళుటకు సంకల్పించినచో దానికి సిద్ధపడుచుండిరి. కాని వారు (యుద్ధము) చేయుటకు అల్లాహ్ ఇష్టపడలేదు. కనుక వారిని తమ స్థానములలోనే కూర్చో బెట్టెను. వారితో (వారి అవిశ్వాస మిత్రులు ఇట్లనిరి) "కూర్చొని వున్న వారితో మీరు కూడ కూర్చొని వుండుడు". వారు మీతో కలిసి వెళ్ళినను చెడు చేయునది తప్ప మీకు ఎట్టి సహాయము చేసేవారు కారు. మీ మధ్య (వైరుధ్యము తెచ్చుటకు) అశ్వములను పరుగెత్తించుచుందురు. మీలో ఉపద్రవము పుట్టించుటకు కోరేవారు. మీలో (కూడ) కొందరు వారికి అందజేయుటకు (తెలియజేయుటకు) మాటలను విందురు. అల్లాహ్ దుష్టులను బాగుగా ఎరుగును. ఇంతకు పూర్వము కూడ ఉపద్రవమును (పుట్టించ) గోరి వుండిరి. నీ కొరకు పరిస్థితులను పలు విధములుగా మార్చి వుండిరి. సత్యము వచ్చెను. అల్లాహ్ నిర్ణయము బహిర్గతమయ్యెను. వారు (ఆ నిర్ణయమును) ఇష్టపడ లేదు. (త్రోసి పుచ్చి వుండిరి).

దీని మరిన్ని వివరాలను తర్వాత ప్రస్తావింతునని హుజూరె అన్వర్ తెలిపిరి.

అనంతరం రబ్వాలోని మసీదుపై దాడి ఫలితంగా గాయపడిన వీరులైన ఖుద్దాం గురించి ప్రస్తావిస్తు హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు త'ఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి. గత ఖుత్బాలో రబ్వాలోని మసీదుపై దాడి జరిగిన విషయాన్ని నేను ప్రస్తావించితిని. క్షతగాత్రులైన అహ్మదీ ఖుద్దాం కొరకు దుఆ కూడా చేయండి. అల్లాహ్ తఆలా సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించుగాక! తర్వాతి ప్రతి దుష్ఫలితం నుండి కూడా వారిని రక్షించుగాక! ప్రస్తుతం ముగ్గురు ఖుద్దాం అధిక గాయాల కారణంగా ఆసుపత్రిలో చికిత్స

పొందుతున్నారు. మిగిలిన ఐదుగురికి చికిత్స అందించి ఇంటికి పంపబడింది. కానీ వారి గాయాలు పూర్తిగా మానుటకు సమయం పట్టును. అల్లాహ్ వారందరికీ సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించుగాక, మరియు భవిష్యత్తులో జమాఅత్ సభ్యులను ప్రతి చోట ప్రతి కీడు నుండి రక్షించుగాక.

ముగింపులో హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు త'ఆలా బినస్రిహిల్ అజీజ్ మార్షల్ దీవులకు చెందిన గౌ॥ సామ్ అలీ నైనా గారి సద్గుణాలను ప్రస్తావించి వారి పరోక్ష అంత్యక్రియ ప్రార్థన చదివింతునని ప్రకటించిరి. సామ్ అలీ నైనా గారు తమ ఇస్లాం స్వీకరణ గురించి తమ మాటల్లో ఇలా వివరించారు. అల్లాహ్ దయవలన ముస్లిం అయిన తర్వాత నా హృదయానికి శాంతి, ఆత్మకు సంతృప్తి లభించింది. నమాజ్ నన్ను మార్చివేసింది. నా భార్య కూడా నాలో ఈ మార్పును గమనించింది. అప్పటి నుండి నాకు ఏదైనా అవసరం ఏర్పడినప్పుడల్లా నేను అల్లాహ్‌ను అడిగేవాడిని అల్లాహ్ దానిని వెంటనే నెరవేర్చేవాడు. నేను ఈ సహాయాన్ని పలుమార్లు నా కళ్ళతో చూశాను. ప్రతి దుఆలో అల్లాహ్‌కు కృతజ్ఞతలు చెప్పుకునేవాడిని. ఆయన మనవరాలు జూలియా ఇట్లన్నారు. ఆయనొక గొప్ప నిజాయతీ గల వ్యక్తి. హుజూరె అన్వర్ ఆ దివంగతుడి క్షమాపణ మరియు ఉన్నత స్థానాల కోసం ప్రార్థించారు.

---

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ ـ وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا ـ مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ ـ وَنَشْهَدُ أَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ ـ عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَأْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِى الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ ـ يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ ـ اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ ـ